# కడప, బయ్యారంలలో ఉక్కు పరిశ్రమల స్థాపన

## ఉద్దేశ్యపూరిత నిర్లక్ష్యం వహిస్తున్న కేంద్రం, రాష్ట్రాల పాలకులు

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్ర పునర్విభజన చట్టం 2014లో కేంద్ర పాలకులు ఇరు రాష్ట్రాలలో స్థాపించబోయే విద్యాసంస్థలు, ప్రాజెక్టులు, కర్మాగారాల గురించి పేర్కొన్నారు. విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం-కడప జిల్లాలోను, తెలంగాణరాష్ట్రం ఖమ్మంజిల్లా, బయ్యారంలలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారాలు నిర్మించాలనేది అందులో ఒక అంశం. చట్టంలో పేర్కొన్న అనేక అంశాలకు తిలోదకాలు ఇచ్చినట్లు ఇరు తెలుగురాష్ట్రాలలో ఉక్కు పరిశ్రమల నిర్మాణానికి కూడా కేంద్ర పాలకులు సుముఖంగా లేరు. ఇరు రాష్ట్రాలలో అధికారంలోనున్న తెలుగుదేశం, టిఆర్ఎస్ పాలకులు కూడా ఈ పరిశ్రమలు సాధించుకోవటానికి, కేంద్రంపై వత్తిడికి, ఆందోళనకు సిద్ధం కాలేదు. నాలుగేళ్ళ కాలం గడిపిన తర్వాత 2019 ఎన్నికల ముంగిట ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో అధికార, పాలక పార్టీలకు కడప ఉక్కు ఫ్యాక్టరీకోసం ఆందోళన, ఒక ఎన్నికల ఎజెండా అంశంగా మారింది.

కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించకపోవటానికి-దేశం పట్ల, ప్రజలపట్ల బాధ్యత లేని పాలకుల విధానాలే ప్రధాన కారణం; దేశం గురించి, ప్రజల గురించి పైకి జపం చేస్తూనే, సామ్రాజ్యవాదుల బహుళజాతి కంపెనీలకు, బడా కార్పొరేటు కంపెనీలకు మన సహజసంపదలను దోచిపెట్టే వారి నీచమైన విధానాలే దీనికి మూలం; తమ స్వార్థ ప్రయోజనాల కోసం దేశాన్ని, ప్రజలను తెగనమ్మటానికి సిద్ధపడే వారి దళారీ విధానాలే కీలకం. దేశంలో, రాష్ట్రాలలో కొన్ని ప్రాంతాలకే నీటి పారుదల, విద్యా, వైద్య, అవకాశాలను కల్పించి, అత్యధిక ప్రాంతాలను విద్యా, వైద్యాలకు దూరంగా నిరంతర దుర్భిక్ష పీడిత ప్రాంతాలుగా దశాబ్దాల తరబడి కొనసాగించటంలో పాలకుల కుటిల విధానాలు దాగివున్నాయి. తమ పరిశ్రమలకు కావలసిన కారుచౌక కూలీల ఉత్పత్తి కేంద్రాలుగా ఈ ప్రాంతాలు మిగిలిపోవటంతో పాటు, ప్రాంతీయ అసమానతలు పెరిగి ప్రజల మధ్య శత్రుత్వం రగులుకోవాలని పాలకులు కోరుకుంటున్నారు. సమగ్రాభివృద్ధికి పథకాలు లేకా కాదు; నిధులు లేకా కాదని గ్రహించాలి. సహజ వనరులను ప్రత్యేకించి ఇనుప ఖనిజ వనరుల వినియోగం పట్ల మన దేశ, రాష్ట్రాల పాలకులు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల బాధ్యతారహిత వైఖరులను విశాఖ ఉక్కు పరిశ్రమ నేపథ్యం నుండీ పరిశీలిద్దాం.

ఐదు దశాబ్దాల క్రితం 'విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు' పేరుతో రాష్ట్రవ్యాపితంగా దీర్ఘకాల ఉద్యమం సాగింది. ఈ ఆందోళనలపై పోలీసులు జరిపిన కాల్పులలో వివిధ జిల్లాలో మొత్తం 32 మంది అమరులయ్యారు. ఫలితంగా కేంద్ర ప్రభుత్వం దిగివచ్చింది. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ 30 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో మొదలై ప్రస్తుతం 73 లక్షల టన్నులకు చేరుకుంది. 60 వేల మందికి ప్రత్యక్షంగా, లక్షమందికి పైగా పరోక్షంగా ఈ ఫ్యాక్టరీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. ఆశ్చర్యకరమైన అంశమేమంటే, విశాఖ స్టీలు ఫ్యాక్టరీకి ఇనుపఖనిజ అవసరాలను గ్యారంటీ చేస్తూ ఇంతవరకు ప్రభుత్వం క్యాప్టివ్‌మైన్స్‌ను కేటాయించలేదు. విశాఖకు 270కి.మీ॥ దూరం నుండి ప్రస్తుత ఛత్తీస్‌ఘడ్ లోని బైలదిల్లా గనులనుండి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి ఇనుపఖనిజం సరఫరా అవుతోంది. విశాఖ స్టీల్స్ కోరినా అనంతపురం ఇనుప ఖనిజ గనులు కేటాయించలేదు. అలాగే ఒరిస్సాలో ఇనుప గనులనూ క్యాప్టివ్‌మైన్స్‌గా ఇవ్వటానికి ప్రభుత్వం నిరాకరించింది. మరోవైపున దక్షిణకొరియా బహుళజాతి సంస్థ పోస్కోకు ఒరిస్సా కళింగనగర్‌లోని ఇనుపగనులను కట్టబెట్టటమేగాక, ఆ ఖనిజాన్ని ఎగుమతి చేసుకోవటానికి కూడా అనుమతించింది.

అలాగే ఉక్కు ఉత్పత్తి రంగంలో పెద్దసంస్థలుగా వున్న టాటా, జిందాల్, మిట్టల్ కంపెనీలను మించి 1కోటి 20లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో (!) ఆంధ్రప్రదేశ్‌లో 2007లో బ్రాహ్మణీ స్టీల్స్‌కు శంకుస్థాపన చేశారు. 'ఆలూలేని సూలూలేని' ఈ ఫ్యాక్టరీకి లక్ష టన్నుల ఇనుప ఖనిజ గనులను క్యాప్టివ్ మైన్స్‌గా కేటాయించారు.

సామ్రాజ్యవాద, ప్రైవేటు ఉక్కు పరిశ్రమల ప్రయోజనాలకే పాలకులు కట్టుబడి వున్నారని, ప్రభుత్వ రంగంలోని విశాఖ ఉక్కు పరిశ్రమకు కనీస గ్యారంటీలు కల్పించటం లేదని అర్థం కావటం లేదా?!

ఉక్కు తయారీలో క్రోమైట్ ఖనిజం కీలకమైనది. క్రోమైట్ కలపటం ద్వారానే ఉక్కు తుప్పు పట్టకుండా ఉంటుంది. మన దేశంలో 6 కోట్ల 60 లక్షల టన్నుల క్రోమైట్ ఖనిజ నిల్వలున్నాయని అంచనా. ప్రపంచ నిల్వలతో పోలిస్తే మన దేశంలో నిల్వలు ఒక్క శాతం మాత్రమే. ఒరిస్సా మైనింగ్ కార్పొరేషన్, టాటా స్టీల్, మరికొన్ని కంపెనీలు ఇంతటి విలువైన క్రోమైట్ ఖనిజాన్ని తవ్వి వెలికితీస్తున్నాయి. వెలికితీసిన క్రోమైట్ ఖనిజాన్ని దాదాపు 85 శాతం ఎగుమతి చేస్తున్నాయంటే, ఖనిజవనరుల వినియోగంలో మన పాలకులెంత ప్రజావ్యతిరేక స్వభావంతో ఉన్నారో తెలుస్తుంది.

ఇక, మన రాష్ట్రంలో గాలిజనార్దనరెడ్డి సోదరుల ఆధ్వర్యంలో బ్రాహ్మణి స్టీల్స్ కోసమంటూ ఆంధ్ర-కర్నాటక సరిహద్దులలోని 65 ఎకరాలలో 2007లో ఇనుప ఖనిజ తవ్వకాలకు అనుమతించారు. ఓబుళాపురం మైనింగ్ కార్పొరేషన్‌కు అనుమతి పొందిన 'గాలి సోదరులు' అక్కడ మరో 260 ఎకరాల భూములను కబ్జా చేశారు. ఈ భూములను తనఖా పెట్టి 350 కోట్ల రూపాయలు దండుకున్నారు. పాలకుల కనుసన్నలలోనే లీజు పొందేందుకు విధించిన నిబంధనలన్నీ బేఖాతరు చేశారు. బ్రాహ్మణిస్టీల్స్ శిలాఫలకంగా మిగిలిపోగా, హద్దులనతిక్రమించి ఇనుపఖనిజ తవ్వకాలు జోరుగా సాగించారు. రైలు, రోడ్డు, సముద్ర మార్గాలలో సగటున రోజుకు

20 వేల టన్నులకు పైగా ఖనిజాన్ని ఎగుమతి చేస్తున్నా పాలకులు మిన్నకున్నారు. అనంతపురం జిల్లా ఓబుళాపురం నుండి నెల్లూరుజిల్లా కృష్ణపట్నం ఓడరేవు ద్వారా ఇనుప ఖనిజం ఎగుమతి చేసే క్రమంలో వీరి లారీలక్రింద నలిగి ఒక్క నెల్లూరు జిల్లాలోనే వందలాది మంది మరణించినా, పాలకులు పట్టనట్లు వ్యవహరించారు. ఈ ముడి ఖనిజానికి టన్నుకు కేవలం 11రూ။నుండి 27రూ။ మాత్రమే ప్రభుత్వానికి సెస్సుగా చెల్లించి, టన్ను 5 వేల రూ။ నుండి 7వేల రూ။కు విదేశాలకు అమ్ముకొని 'గాలి సోదరులు' వేల కోట్ల రూ။ గడించారు. ఇవన్నీ నిరాటంకంగా సాగిపోవటానికి పాలక పార్టీలన్నింటికీ ఎవరి వాటాను వారికందించారు. ఈ విధంగా అక్రమంగా పోగుపడ్డ సంపదతో కర్నాటక రాష్ట్రంలో రాజకీయాలను శాసించారు. బిజెపి ప్రభుత్వంలో మంత్రులుగా, అధికార పార్టీ నాయకులుగా యధేచ్ఛగా ఇనుప ఖనిజాన్ని కొల్లగొట్టారు. తమ స్వీయ, స్వార్థ ప్రయోజనాలు మినహా పాలకులకు ప్రజల, దేశ ప్రయోజనాలు పట్టవనటానికి ఇంతకంటే నిదర్శనమేం కావాలి?! పాలకవర్గ పార్టీల మధ్య, పార్టీలలో ముఠాల మధ్య వాటాల పంపిణీలో గొడవలే సిబిఐ విచారణలుగా, అక్రమ ఆస్తుల కేసులుగా నమోదు కావటం మినహా, బహిరంగంగా, అందరి కళ్ళెదురుగా ఖనిజాన్ని కొల్లగొట్టుకెళుతున్నపుడు వీరంతా కళ్ళప్పగించిన వారేగా?!

దేశంలో ప్రజలందరికీ గృహ నిర్మాణం జరగాలంటే ఇనుము, ఉక్కు అవసరం ఎంతో వుంది. ప్రపంచంలో సగటు ఉక్కు తలసరి వినియోగం 216 కిలోలు వుండగా, మన దేశంలో 60 కిలోలుగా వుంది. ప్రస్తుత దేశ ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం 10 కోట్ల టన్నులు కాగా, 2030 నాటికి దానిని 30 కోట్ల టన్నులకు పెంచాలనుకుంటున్నట్లుగా ఉక్కు మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఆ మేరకు కూడా ఉక్కు పరిశ్రమలు స్థాపించాల్సిన అవసరముంది.

కడప ఉక్కుపరిశ్రమ ఏర్పాటుకు కావలసిన గనులు, భూమి, నీరు తదితర అన్ని వనరులూ వున్నాయి. అపార మానవ శ్రమ శక్తి అందుబాటులో వుంది. అనంతపురంలో లభించే ఇనుప ఖనిజం నాణ్యత కలిగిందని ఫ్యాక్టరీ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసిన మెకాన్ సంస్థ స్పష్టం చేసింది. ఇక్కడ లభ్యమయ్యే ఇనుప ఖనిజ నాణ్యత(ఎఫ్ఇ కంటెంట్) 58.5 శాతంగా వుంది. వెనుకబడిన రాయలసీమ జిల్లాల్లో ఈ ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం జరిగితే ఒక మేరకైనా ప్రజల జీవితాలలో మెరుగుదలకు తోడ్పడుతుంది. అనంతపురంలో లభ్యమయ్యే ముడి ఖనిజం ఉక్కుఫ్యాక్టరీ నిర్వహణకు 15-20 సం။లు సరిపోతుంది. దీనికి దగ్గరలో ఒకవైపున బళ్లారిలో 200 కోట్ల టన్నుల ఇనుప ఖనిజ లభ్యత వుంది. మరొకవైపున ప్రకాశం జిల్లాలో ఇనుప ఖనిజ నిల్వలు వున్నాయి. ఫ్యాక్టరీ నిర్మాణానికి తగిన సాంకేతిక నైపుణ్యమూ మనకు వుంది. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఖచ్చితంగా కడప జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించి తీరాలని డిమాండ్ చేయాలి.

దేశంలోని సమస్త వనరులు ప్రజల ప్రయోజనం కోసమే వినియోగించాలని, భవిష్యత్తు తరాల అవసరాల దృష్టితో దేశంలోని విలువైన ఖనిజాల ఎగుమతిని ఆపివేయాలనే విధానాన్ని అంతా ఒక్కటై నినదించాలి. "తనలో దేశభక్తి అణు మాత్రమున్న ఏ పౌరుడైనా సిగ్గుచేటైన ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా సహజంగానే తిరుగుబాటు చేస్తాడు. భారతప్రజల సముజ్వల కీర్తిని పునఃప్రతిష్టించటానికి పాటు పడతాడ"న్న కా။టి.ఎన్ ఆశలను నిజం చేసేందుకు పూనిక వహించాలి. పాలకవర్గ పార్టీలు తమ ఎన్నికల ప్రయోజనాలకు లోబడి మాత్రమే కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధన పేరిట నాటకాలు ఆడుతున్నారని గ్రహించాలి. 'గాలి' సోదరులవంటి దళారులకో, లేక సామ్రాజ్యవాదుల బహుళజాతి సంస్థలకో కడప ఉక్కు ఫ్యాక్టరీని కట్టబెట్టాలనే తలంపును ప్రతిఘటించాలి. ఒకరిపై ఒకరు నిందలు మోపుకుంటూ తమ బాధ్యతలను గాలికొదిలేసిన కేంద్ర-రాష్ట్ర పాలకుల వైఖరులను నిలదీయాలి. ప్రభుత్వ రంగంలో కడప, బయ్యారంలలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం కోసం కార్మికులు, రైతాంగం, యావన్మంది ప్రజానీకం, ప్రజాతంత్రవాదులు ఉద్యమించాలి.

ooooo